

అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, జూన్ 11 : సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ(వికారాబాద్) కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌శర్మ మంగళవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ లెక్చరర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 14న సాయంత్రం 4గంటల వరకు మొయినాబాద్ మండలం తోల్‌కట్ట గ్రామం సమీపంలో ఉన్న ఎస్వీ విద్యాసంస్థల క్యాంపస్‌లో గల డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8374915652 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



గౌడవెల్లిలో పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. తమ పిల్లలను బడులకు తోలేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఈ సారీ పరిష్కారం కాలేదు. ఉపాధ్యాయుల కొరత, శిథిలావస్థకు చేరిన భవనాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి కాలేదు. సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ఏదేమైనా నూతన విద్యా సంవత్సర ఆరంభాన్ని విద్యార్థులు సంతోషంగా మొదలుపెట్టేందుకు సంసిద్ధమయ్యారు.

సెలవులకు టాటా..

ఇక చదువు బాట!

- సమస్యలతోనే సర్కారు బడులకు స్వాగతం
- అసంపూర్తిగానే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- సమస్యల మధ్య విద్యాసంవత్సరం ఆరంభం

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

రంగారెడ్డి అర్బన్, జూన్ 11 : ఇక వేసవి సెలవులు ముగిశాయి. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. బడికి వెళ్లేందుకు పిల్లలు సిద్ధమయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 881 ప్రాథమిక పాఠశాలల్లో 62,730 విద్యార్థులు, 180 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 19,257 మంది విద్యార్థులు.. 284 ఉన్నత పాఠశాలల్లో 68,159 మంది విద్యార్థులు ఉన్నారు. గత విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. కానీ ఉపాధ్యాయుల కొరత కారణంగా మెరుగైన విద్య అందటం లేదు. విద్యార్థులున్న చోట టీచర్లు లేరు. టీచర్లున్న చోట విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ రెండూ ఉన్న బడుల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పాత సమస్యలతోనే బుధవారం తిరిగి బడులు తెరుచుకోనున్నాయి.

ఇంకా పాఠశాలలకు చేరుకోని పుస్తకాలు

అయితే ఇప్పటి వరకు పుస్తకాలు, దుస్తులు పాఠశాలలకు చేరుకోలేదు. యూనిఫామ్‌ల విషయానికొస్తే ఇంకా కుట్టుడు పూర్తి కాలేదు. జిల్లాకు 5.9కోట్ల ఖర్చుతో 1,47,642 విద్యార్థులకు అందించేందుకు 13,44,080 పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 74.43శాతం పుస్తకాలను జిల్లా గోదాం నుంచి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు 7,63,329 ఉచిత నోట్ పుస్తకాలను మంజూరు చేశారు. ఇందులో 6, 7వ తరగతులకు ప్రతీ విద్యార్థికి ఆరు నోట్ పుస్తకాల చొప్పున, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 14 చొప్పున నోట్‌పుస్తకాలను ఇస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మొదటి విడతలో 423 పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరమ్మతులు చేపడుతున్నారు. అయితే పాఠశాలల పునఃప్రారంభం నాటికే పనులు పూర్తిచేయాలనే ఆదేశాలున్నా చాలా స్కూళ్లల్లో ఇంకా పనులు పూర్తి కాలేదు.

సమస్యల లోగిళ్లు..

చేవెళ్ల మండలం దేవరాంపల్లి పాఠశాల శిథిలావస్థకు చేరింది. రెండేళ్లుగా పిల్లలను పంచాయతీ కార్యాలయంలో కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో మీటింగ్ ఉంటే ఆ రోజు పిల్లలకు చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు. ఈ విషయమైన జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ దృష్టికి తీసుకు వచ్చారు. కడ్తాల కేజీబీవీ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇలా జిల్లాలోని అనేక పాఠశాలలో సమస్యలు దర్శనమిస్తున్నాయి.

పారిశుధ్య కార్మికులు లేరు

పాఠశాలలు పునఃప్రారంభవుతున్న తరుణంలో పాఠశాలల్లో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్ల నుంచి ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించలేదు. ప్రభుత్వం మాత్రం పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు వారి పరిధిలోని పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వారు పాఠశాల ప్రారంభ సమయాల్లోనే పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఇక ఆతర్వాత వారు పట్టించుకోవడం లేదు. ఇక పాఠశాలల్లో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి.

స్కూళ్లలో పరిశుభ్రత పనులు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): 55రోజుల తరువాత ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేడు తెరుచుకోనున్నాయి. వేసవి సెలవులు మంగళవారంతో ముగిశాచి. విద్యాశాఖ అధికారులు మంగళవారం స్కూళ్లను శుభ్రం చేయించారు. ఇప్పటికే విద్యార్థుల పుస్తకాలు పాఠశాలలకు చేరుకున్నాయి. విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పుస్తకాలు, బ్యాగులు, టిఫిన్ బాక్సుల కొనుగోళ్లకు బుక్‌స్టాళ్లకు వెళ్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, 10 ఎయిడెట్ పాఠశాలలు మొత్తం 515 పాఠశాలలున్నాయి.

శిథిలావస్థలో పెద్ద తండా పాఠశాల



శిథిలావస్థలో నర్సాపూర్ పెద్ద తండా పాఠశాల

మర్పల్లి: మండలంలోని నర్సాపూర్ పెద్ద తండా పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఏళ్ల నాటి ఈ భవనం వానకు ఉరుస్తోంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూలు భవనానికి ఏటా నామమాత్ర మరమ్మతులు చేయిస్తున్నారు. వర్షం వస్తే గదుల్లో నీరు నిండుతుంది. సరైన వసతి లేక తల్లిదండ్రులు తమ పిల్లలను పట్లూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే ఈ పాఠశాలలో టీచర్లను భర్తీ చేయలేదు. నవాబుపేట మండలం నుంచి ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై నియమించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాల సమస్యలు తీర్చాలని తండా వాసులు కోరుతున్నారు.

మండల కేంద్రాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు

వికారాబాద్(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసేలా జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. కాగా బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 1,063 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా, వాటిలో 776 ప్రాథమిక, 111 ప్రాథమికోన్నత, 176 ప్రభుత్వ, జడ్పీ పాఠశాలలున్నాయి. 9 ఎయిడెడ్, 18 కేజీబీవీ, 9 మోడల్ విద్యాలయాలు, 8బీసీ, 10గిరిజన, 8సాంఘిక సంక్షేమ, 6మైనార్టీ, 2 ప్రభుత్వ గురుకుల పాఠశాలలున్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమానికి 371 పాఠశాలను ఎంపిక చేశారు. రూ.23కోట్లతో 45 పాఠశాలల్లో సదుపాయాలు కల్పించి మమ అనిపించారు. కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద 1,064పాఠశాలల్లో విద్యుద్దీరణ, మరుగుదొడ్ల పనులు, తాగునీటి సదుపాయం వంటి పనులు చేపట్టగా, 600 పాఠశాలల్లో పనులు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో పాఠశాలల్లో 83,462 మంది విద్యార్థులు చదువుతున్నారు. 3923 మంది ఉపాధ్యాయులు, 52 మంది పీఈటీలు పనిచేస్తున్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

జిల్లాకు 5,27,030 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా 5,18,000 పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. వాటిని పాఠశాలలకు తరలిస్తున్నారు. అలాగే 4,60,422 నోట్ పుస్తకాలను సరఫరా చేశారు. స్కూళ్లు తెరిచే నాటికి పాఠశాలల్లో పాఠ్య, నోట్ పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

యూనిఫాంలు రెడీ!

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 85,988 జతల యూనిఫాం సిద్ధం చేయాల్సి ఉండగా, ఈనెల 10వ తేదీ నాటిని 76,408 జతలు పాఠశాలలకు చేర్చారు. ఒక్కో విద్యార్థికి రెండు జతలు అందజేస్తారు. కాగా బడిబాట కార్యక్రమంలో 237 మంది బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో 4,648 మంది ఉపాధ్యాయులకు గాను 3,912 మంది పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగనుంది. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పదో తరగతి పరీక్ష ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. రెండేళ్లుగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది.

విద్య, వైద్యం అస్తవ్యస్తం

- మెరుగైన సేవలందడం లేదని సభ్యుల ధ్వజం
- డాక్టర్లు అందుబాటులో ఉంటలేరని ఆగ్రహం
- టీచర్ల కొరతతో విద్యార్థులకు అందని ద్రాక్షలా విద్య
- విద్య, వైద్య శాఖల్లో డిప్యూటేషన్ల రద్దుకు తీర్మానం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడి చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 11 : జిల్లాలో విద్య, వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని, మెరుగైన సేవలు అందడం లేదని జడ్పీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సభ్యులు హాజరయ్యారు. కోరం లేని కారణంగా సమావేశాన్ని గంట ఆలస్యంగా ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా డాక్టర్లు ఉండటం లేదని, డ్యూటీకి వచ్చినా సమయపాలన పాటించడం లేదన్నారు. డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని అర్బన్ హెల్త్ సెంటర్ చేసినా ఒక్క వైద్యుడూ ఉండటం లేదని ఎంపీపీ ఆరోపించారు. పోస్టుమార్టం గదిని ఇళ్ల మధ్య నుంచి తొలగించాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఆసుపత్రుల ఆపరేషన్ థియేటర్లలో సౌకర్యాలు లేక మూతపడ్డాయని చైర్‌పర్సన్, కలెక్టర్‌ల దృష్టికి తెచ్చారు. షాపూర్ పీహెచ్‌సీలో మూడు నెలల నుంచి వైద్యుల్లేరని డీఎంహెచ్‌వో దృష్టికి తెచ్చారు. శంషాబాద్‌లో డాక్టర్ ఇలా వచ్చి అలా వెళ్తున్నారని జడ్పీటీసీ సభ్యురాలు ఆరోపించారు. డీఎంహెచ్‌వో స్పందిస్తూ డాక్టర్ జీతాన్ని నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కేశంపేట పీహెచ్‌సీలో ఒక్క డాక్టరైనా అందుబాటులో ఉంటలేరని జడ్పీటీసీ విశాల తెలిపారు. ఆస్పత్రిలో పాముకాటు మందు లేదని తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేష్ అన్నారు. సమస్యలు విన్నవిద్దామంటే రెండు నెలల నుంచి డీఎంహెచ్‌వో ఫోన్ కలవడం లేదని షాబాద్ ఎంపీపీ చెప్పారు. షాబాద్ ఆసుపత్రికి డాక్టర్‌ను ఇవ్వాలని ఎంపీపీ కోరారు. యాచారం పీహెచ్‌సీలో 24గంటలు వైద్యులు ఉండటం లేదన్నారు. పల్లె దవాఖానాలో డాక్టర్లు లేరని మంచాల జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి తెలిపారు. మొయినాబాద్ మండలం చిల్కూరులో ఆస్పత్రి కట్టి రెండేళ్లవుతున్నా ప్రారంభించలేదని ఎంపీపీ అన్నారు. విద్య, వైద్య శాఖల్లో డిప్యుటేషన్లను రద్దుచేయాలని, పోస్టింగ్ ఉన్నచోటే విధులు నిర్వర్తించాలని, అధికారులే ఉద్యోగులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. డాక్టర్ల డిప్యూటేషన్ల రద్దుకు తీర్మానం చేయాలని సభ్యులు కోరగా కలెక్టర్ శశాంక స్పందిస్తూ డిప్యుటేషన్లు శాఖాపరమైన నిర్ణయమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, కోఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

24గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుంటే ధర్నా చేస్తాం

కడ్తాల మండలంలో ఆరేళ్ల కింద కట్టిన కస్తూర్బా పాఠశాలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వక ప్రారంభానికి నోచుకోలేదని, రూ.6.14లక్షల డీడీ కట్టించుకున్నా అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలేదని జడ్పీటీసీ దశరథ్ అన్నారు. అద్దె భవనంలో కేజీబీవీ కొనసాగుతోందన్నారు. 250 మంది బాలికలు రెండే బాత్ రూమ్‌లతో ఇబ్బంది పడుతున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. 24గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుంటే వెయ్యి మందితో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తానని జడ్పీ సమావేశంలో బైటాయించారు. సమస్య పరిష్కరించాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. మహేశ్వరం మండలంలో స్కావెంజర్ల సమస్య తీర్చాలని సభ్యులు కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు.

ఇంకా చెట్ల కింద చదువులా?

చేవెళ్ల మండలం దేవరాంపల్లి పాఠశాల శిథిలావస్థకు చేరగా రెండేళ్లుగా పంచాయతీ భవనంలోనే కొనసాగుతోందని, పంచాయతీలో మీటింగ్ ఉంటే పిల్లలను చెట్లకింద కూర్చోబెడుతున్నారని జడ్పీటీసీ విజయలక్ష్మి తెలిపారు. ఇంకా చెట్ల కింద చదువులు ఏమిటని కలెక్టర్ శశాంక ప్రశ్నించారు. రెంటెడ్ బిల్డింగ్ చూడాలని డీఈవోను ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలోని చర్లగూడ పాఠశాలను కూల్చివేశారని, కొత్త బడి కట్టాలని సభ్యుడు కోరారు. విద్యార్థులకు కుడుతున్న యూనిఫాంకు ధర జతకు రు.వంద చొప్పున ఇవ్వాలన్నారు. 4 మండలాలకు ఒక్కరే ఎంఈవో ఉన్నారని ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ తెలిపారు.



నీటి సరఫరాలో కంట్రోలింగ్ సరిగ్గా లేదు

జిల్లాలో నీటి కొరత లేదని, కానీ గ్రామాల్లో పైప్‌లైన్లకు ఉన్న వాటర్ కంట్రోలింగ్ వాల్వ్‌లు సరిగ్గా పనిచేయడం లేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

యాచారం మండలంలో శ్రీ చైతన్య స్కూల్‌కు అనుమతి లేకున్నా 450 మంది విద్యార్థులను చేర్చుకున్నారని సభ్యురాలు తెలిపారు.

తరుగు తీస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

బస్తాకు 2-3కిలోల ధాన్యం తరుగు తీస్తున్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. రైతు వేదికలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, వీటితో ఉపయోగం లేకుండా పోయిందని, రైతు సమావేశాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ అక్కడే నిర్వహించాలని కోరారు. ఉద్యాన శాఖ అధికారుల అడ్రెస్సే లేదన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చెప్పారు. గాలివానలకు విద్యుత్ పోతోందని, ఏఈలు, లైన్‌మెన్ స్పందించడం లేదని, వేలాడుతున్న వైర్లను సరిచేయాలని సభ్యులు కోరారు. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో నిధులు సక్రమంగా విడుదల కాక అనుకున్న మేరకు అభివృద్ధి చేయలేకపోయానని చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. ఈ సమావేశం చివరిదన్నారు. చాలా సమావేశాల్లో ప్రజాసమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. అధికారులతో చర్చించి కొన్ని పరిష్కరించామన్నారు. ఐదేళ్ల సహకరించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్క ప్రొసీడింగ్ ఇచ్చిన పాపాన పోలే!

ఆరు నెలల నుంచి తాము ఒక్క ప్రొసీడింగైనా ఇచ్చిన పాపాన పోలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజులైతే తమ పదవీకాలం ముగుస్తుందని, అంతలోగా వర్క్ ప్రొసీడింగ్ ఇవ్వాలని కోరారు. 9 నెలల నుంచి ప్రతిపాదనలు పంపినా ప్రొసీడింగ్‌లు ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచాయని, రెండు రోజుల్లో ప్రొసీడింగ్‌లు ఇస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల డుమ్మా

జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకాలేదు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాత్రం మధ్యాహ్నం తర్వాత మీటింగ్‌కు వచ్చారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్ రూరల్, జూన్ 11 : మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామం మంగళవారం శివనామస్మరణతో మార్మోగింది. పార్వతీసోమేశ్వరాలయ 14వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మొదట శివలింగానికి వేదపండితులు అభిషేకం నిర్వహించారు. అనంతరం పార్వతీసోమేశ్వరుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతనం భక్తులకు అన్నదానం నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ ఆలయ ఆవరణలోని సుందరేశ్వరాలయ అర్చకులు సురేష్, ఆలయ కమిటీ చైర్మన్ ముదిగొండ జంగం యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాజయ్యయాదవ్, మాజీ సర్పంచ్ మంజులరవియాదవ్, మల్లేష్ తదితరలు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ హుండీ ఆదాయం రూ.15.17లక్షలు

కడ్తాల్, జూన్ 11 : మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రమావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌ల సమక్షంలో హుండీలు లెక్కించారు. 75 రోజులకు రూ. 15,17,494 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, వెంకటరమణ, సంతోష్‌కుమార్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పత్యానాయక్, కృష్ణయ్య, బీబీ.చారి, శ్రీను, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న నర్సింహారెడ్డి

మోదీతోనే దేశ ప్రజలకు ఉత్తమ సేవలు

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, జూన్ 11 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తారని మెదక్ ఎంపీ రఘునందర్‌రావు అన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీకి మూడోసారి ప్రధాన మంత్రిగా అవకాశం ఇచ్చారని, ప్రజలకు ఆయన ఉత్తమ సేవలందిస్తారన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలందరి సమస్యలు పరిష్కారించారని తెలిపారు. దేశప్రజలు ముచ్చటగా మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేశారని గుర్తుచేశారు. అలాగే తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిన మెదక్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. ఎంపీ రఘునందర్‌రావుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు నందకిశోర్, వందలాది మంది కార్యకర్తలు స్వాగతం పలికారు.

ప్రభుత్వాస్పత్రి ఎదుట నర్సుల నిరసన



ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నర్సులు

ఘట్‌కేసర్, జూన్ 11: వైద్య సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి నర్సులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న నర్సింగ్‌అధికారులు, నర్సులకు వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవోనెంబర్ 317ద్వారా వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించాలన్నారు. కొత్తగా రిక్రూట్ అయిన నర్సింగ్ సిబ్బందికి రావా ల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ క్యాడర్ కోసం జేడీ, వీడీ పోస్టులను ఏర్పాటు చేసి నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ అటానమస్‌ను రద్దుచేసి వైద్య ఆరోగ్యశా ఖలో విలీనం చేయాలన్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లోని 1999బ్యాచ్ నుంచి పెండింగ్‌లో అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కబ్జాకు గురైన భూమి స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రెవెన్యూ స్థలంగా బోర్డు పెడుతున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు, జూన్ 11: విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన గల ప్లేగ్రౌండ్ ప్రభుత్వ భూమిగా నిర్ధారించి తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది దగ్గర ఉండి ప్రభుత్వ భూమిగా మంగళవారం బోర్డు పాతించారు. అంతకుముందు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసిన రెవెన్యూ సిబ్బందిని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారా? బోర్డు పాటించారా అంటూ ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి కథనంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్న భూమి పరిశీలన



వ్యవసాయేతర భూమిని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

తాండూరు రూరల్, జూన్ 11 : తాండూరు పట్టణ శివారులోని పాత తాండూరు రోడ్డు మార్గంలో విజయస్టోన్ పాలిషింగ్ కంపెనీ సమీపంలో 181 సర్వేనెంబర్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సర్వేనెంబర్‌లో తొమ్మిది ఎకరాల భూమిని మాణిక్‌రావు కుమారుడు ఎం.రమేష్ ఇటీవల వెంచర్ ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి భూమిని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి వచ్చి పరిశీలించారు. శ్మశాన వాటిక, ఆలయం వంటివి ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సర్వేనెంబర్-181లో ఎన్ని ఎకరాల భూమి ఉంది, అందులో వ్యవసాయేతర భూమికి ఎన్ని ఎకరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు, పారిశ్రామిక భూమినా, వ్యవసాయేతర భూమినా? అని సమగ్ర వివరాలను సేకరించారు. ఈ నివేదికను పరిశీలించి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట దరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు మల్యాడ్ రమేష్, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐలు బాల్‌రాజ్, రాజురెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వాలి : ఎంపీడీవో

కొందుర్గు, జూన్, 11: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వాలని ఎంపీడీవో డాక్టర్ అంజనేయలు అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతికి వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికైన 21మంది విద్యార్థులు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ మాట్లాడుతూ దళితవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మూసివేత నుంచి తిరిగి పూర్వవైభవ స్థితికి చేరుకుందన్నారు. పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థిని జిల్కెళ్ల నిఖిత 376 మార్కులతో నీట్‌లో ప్రతిభ చాటడంతో పలువురు అభినందించారు. షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ రెడ్యానాయక్ విద్యార్థులకు బిస్కెట్స్, విటమిన్ పౌడర్ ప్యాకెట్స్, చాక్లెట్స్ అందజేశారు. దాతలను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. ఎంపీటీసీ ఇస్తారమ్మ మాణేయ్య, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జోన్‌లో సంగారెడ్డి సర్కిల్

- పాలన సౌలభ్యం కోసం విద్యుత్‌శాఖ మార్పులు
- జూలై 1 నుంచి మేడ్చల్ జోన్ నుంచి సంగారెడ్డి ఆపరేషన్స్
- ఉత్తర్వులు జారీ చేసిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చుట్టూ శివారు ప్రాంతాల్లో వేగంగా విస్తరించడం.. భారీగా విద్యుత్ డిమాండ్ పెరగడం, లక్షల సంఖ్యలో కొత్త విద్యుత్ కనెక్షన్లు వస్తుండడంతో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పాలనా సౌలభ్యం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మేడ్చల్ రూరల్ జోన్ పరిధిలోని సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌ను మేడ్చల్ జోన్‌లో కలుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జూలై 1 నుంచి సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్ నిర్వహణ మేడ్చల్ జోన్ పరిధిలోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి సర్కిల్ మేడ్చల్ జోన్‌లోకి తీసుకురావడంతో ఈ జోన్‌లో సర్కిళ్ల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లు మేడ్చల్ జోన్ పరిధిలో ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లు ఉన్నాయి. మెట్రోజోన్ పరిధిలో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్ ఆపరేషన్ సర్కిళ్లు పనిచేస్తున్నాయి. రంగారెడ్డి జోన్‌లో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లు, మేడ్చల్ జోన్‌లో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉండగా కొత్తగా సంగారెడ్డి సర్కిల్‌ను కలిపారు. సంగారెడ్డి సర్కిల్‌లో పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా మొత్తం 7.91 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు ఎక్కువ అపార్ట్‌మెంట్లు, కొత్తకాలనీలు ఏర్పాటవుతుండటంతో విద్యుత్‌శాఖ ఈ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తుంది. బీరంగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, బొల్లారం, పటాన్‌చెరు వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరుగుతోంది. నగరంలో ఎలాంటి విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉందో అదేతరహాలో శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్కిళ్లను విద్యుత్‌శాఖ విస్తరిస్తోంది.



మేడ్చల్ జోన్‌లో సర్కిళ్లు, విద్యుత్ కనెక్షన్లు

సర్కిల్	విద్యుత్‌కనెక్షన్లు
హబ్సిగూడ	8,95,038
మేడ్చల్	8,44,514
సంగారెడ్డి	7,91,364
మొత్తం	25,30,916

స్కూల్‌కు వెళ్దాం.. చలో..!



- కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానం
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- తొలిరోజే యూనిఫాం, పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
- ఈ యేడాది వసతులపై ప్రత్యేకశ్రద్ధ
- సర్కారు బడిలో చేర్పించాలని ప్రచారం

తాండూరు, జూన్ 11: కాంగ్రెస్ సర్కార్ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఈ ఏడాది పలు మార్పులు చేపట్టింది. వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించింది. 2024-25 విద్యా సంవత్సర క్యాలెండర్‌లో ఇది వరకే విద్యాశాఖ ప్రకటించింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో మార్పు తెస్తూ కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానాన్ని తేస్తు కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యాభివృద్ధికి మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించారు. పండుగ వాతావరణంలో పాఠశాలలను రీ ఓపెన్ చేయాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పాఠశాలలో విద్యలో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం మంచి వాతావరణాన్ని కల్పించింది. దీంతో ఉపాధ్యాయులు ఉత్సాహంగా విద్యాబోధన చేసేందుకు సిద్ధమయ్యారు.

గతానికి భిన్నంగా కమిటీలు

పాఠశాలలో రాజకీయాలు ఉండకుండదనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది ప్రభుత్వం సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యా కమిటీల స్థానంలో మహిళా సంఘాలకు భాగస్వామ్యాన్ని కల్పించింది. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా ఉండే ఈకమిటీలో స్థానిక మహిళా సంఘం అధ్యక్షురాళ్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులుగా నామినేట్ చేశారు. రూ.25వేల వరకు పనులన్నింటినీ ఈ కమిటీకే అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, వసతుల కల్పన బాధ్యత ఈ కమిటీలకే అప్పగించారు. ఈ కమిటీలో పర్యవేక్షణ బాధ్యత పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాలలో ఎంపీడీవోలకు అప్పగించారు. స్కూల్ డ్రెస్ స్టిచింగ్ బాధ్యత ఈ సారి మహిళా సంఘాలకు ఇచ్చారు. ఈ ఏడాది పాఠశాల పునఃప్రారంభానికి ముందే బడిబాటను మహిళా సంఘాల సహకారంతో చేపట్టారు.

తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనీఫాంల పంపిణీ

తొలిరోజే విద్యార్థులందరికీ రెండు జతల యూనీఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందించేందుకు సిద్ధం చేశారు. అక్షరా భాష్యం కార్యక్రమంలో చిన్నారులకు ఉచితంగా దాతల ద్వారా పలకలు, బలపాలు అందించాలని విద్యాశాఖ ఆదేశాలున్నాయి. అవసరమైన చోట కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులను నియమించుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. యూనీఫాంలు ఇప్పటికే స్కూళ్లకు చేరాయి.

పండుగ వాతావరణంలో రీ ఓపెన్ చేయాలి

ఈనెల 12వ తేదీన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పండుగ వాతావరణంలో రీఓపెన్ చేయాలని, ఇందుకు ఏఏపీసీ కమిటీ సహకారం తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది. పాఠశాలను తోరణాలతో అలంకరించాలని, ముగ్గులు వేయించాలని సూచించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు.

వసతుల కల్పనపై దృష్టి

ఈ యేడాది పాఠశాలలు తెరవకముందే వసతుల కల్పనకు నిధులు ఇచ్చింది. రూ.25వేల వరకు కమిటీలే పనులు చేసేందుకు అధికారమిచ్చింది. మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ పనులు, మంచి నీటి వసతి కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రతీనెల 'నో బ్యాగ్ డే'

ఈ సారి ప్రతి నెల 4వ శనివారం నో బ్యాగ్ డేను అమలు చేయాలి. రోజూ 30 నిమిషాల పాటు పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, దిన పత్రికలు, మేగజైన్లు చదివించాలి. టీవీ పాఠాలను యథావిధిగా ప్రసారం చేయాలి. విద్యార్థులతో ఐదు నిమిషాలు యోగా, ధ్యానం చేయించాలి. జనవరి 10వ తేదీ నాటికి పదోతరగతి సిలబస్ పూర్తిచేయాలి.

బడి వేళల్లో మార్పు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9గంటలకే ప్రారంభించాలి. ఉన్నత పాఠశాలలు మాత్రం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.45గంటల వరకు కొనసాగుతాయి. ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మార్పులుండవు. యథావిధిగా కొనసాగుతాయి. అదేవిధంగా ఈ సారి పాఠశాలల్లో రోజు 90శాతానికి పైగా విద్యార్థుల హాజరుండాలి. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం బోధన జరగాలి. 6, 7తరగతుల గణితం సబ్జెక్టును ఇక నుంచి భౌతికశాస్త్రం ఉపాధ్యాయులే బోధించాలి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ వంటి అన్ని పాఠశాలల్లో రోజూ 90శాతానికి పైగా విద్యార్థులు హాజరు కావాల్సిందే.

అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 11 : తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా అధికారులందరూ పనుల్లో వేగాన్ని పెంచాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీలు వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు మున్సిపాలిటీలో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పరిసరాల పరిశుభ్రత వంటి పనుల్లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రామ్, కౌన్సిలర్లు రవినాయక్, లావణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

కడ్తాల్, జూన్ 11 కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలును హర్షిస్తూ కడ్తాల మండలం ముద్విన్‌లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ , పార్లమెంట్ ఎన్నికల కోడ్ మూలంగా ఈ పథకం అమలు కాలేదు. కోడ్ ముగియడంతో ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం అమలు కు శ్రీకారం చుట్టారు. స్థానిక మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు ఈర్లపల్లి యాదయ్య, నక్కపోతు నర్సింహ, రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గంట నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కడా పనుల్లో పురోగతి సాధించాలి

వికారాబాద్, జూన్11: కొడంగల్ నియోజకవర్గంలో కడా కింద చేపట్టాల్సిన పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లఓని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. కొడంగల్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, తదితర అభివృద్ధి పనులు మొదలుపెట్టాలన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి అవసరమైన సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పనిచేసే అధికారులందరూ పూర్తి బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు

కల్తీ విత్తనాల అంతు చూడండి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11: అన్నదాతను నట్టేటముంచే కల్తీ విత్తనాల అంతు చూడడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ ఎల్ఎన్ గార్డెన్‌లో మంగళవారం విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులపై డీలర్లు, రైతులకు అవగాహన నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. కల్తీ, నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలను సాగుచేస్తే దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతారని గుర్తుచేశారు. డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నాణ్యమైన, మేలురకమైన విత్తనాలను మాత్రమే వ్యాపారులు విక్రయించాలని సూచించారు. షాద్‌నగర్ ఏడీఏ రాజరత్నం మాట్లాడుతూ వానకాలం పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు తొందరపడి అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని కోరారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐలు కె.ప్రతాపలింగం, సత్యనారాయణ, ప్రసాద్, నర్సింహారావు, మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, వై.యాదయ్యయాదవ్, తదితరులున్నారు.

నా భూమి నాకే చెందాలి

- తనకు అమ్మిన తర్వాత వేరొకరికి విక్రయించారని నిరసన దీక్షకు పూనుకున్నరైతు

షాద్‌నగర్ రూరల్, జూన్ 11: 35 ఏళ్ల క్రితం తనకు భూమి విక్రయించి.. ప్రస్తుతం అదే భూమిని వేరొకరికి విక్రయించారని, ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామానికి చెందిన రైతు శివరాజ్ మంగళవారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరాహార దీక్షకు పూనుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాజ్ తండ్రి పండుగ బాలయ్య 1988లో అదే గ్రామానికి చెందిన మంగలి రాంచంద్రయ్య మరో ముగ్గురి నుంచి సర్వేనెంబర్ 292లో 32 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ భూమిలో బాలయ్య.. అతడి మరణానంతరం ఆయన వారసులు సాగు చేస్తున్నారు. అయితే, అప్పటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేయమని విక్రయించిన వారిని అడుగున్నా.. కాలయాపన చేస్తూ వచ్చారు. మొదట భూమి విక్రయించిన మంగలి రాంచంద్రయ్య మరో ముగ్గురు చనిపోవడంతో వాళ్ల వారసులు విరాసత్ చేయించుకున్నారు. ఇనాం భూమి కావడంతో ఓఆర్‌సీ తెచ్చుకుని ఇతరులకు విక్రయించారు. విషయం తెలుసుకున్న శివరాజ్ తనకు న్యాయం చేయాలని దీక్షకు కూర్చున్నాడు. గ్రామస్తులు మద్దతు తెలిపి ఆయనతో పాటు దీక్షలో కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ గిర్దావర్‌ను పంపించి వివరాలు తెలుసుకున్నారు. వివరాలు కలెక్టర్‌కు పంపి న్యాయం జరిగే విధంగా చూస్తామని చెప్పారు. అయితే, తనకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని బాధితుడు తెలిపాడు.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

కడ్తాల్, జూన్ 11: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పాలనా సౌలభ్యం, ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంగళవారం తహసీల్దార్ ముంతాజ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి కసిరెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణానికి రెండు విడతల కింద రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని, నిధులు చాలకపోవడంతో కొంతమేర పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, మరో రూ.20 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ పరమేశ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పనులకు చేసిన ఖర్చుకు మధ్య వ్యత్యాసం కన్పిస్తుందని ఎమ్మెల్యే ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఏఈ పరమేశ్‌ను ఆదేశించారు. బోరు నిర్మాణానికి తన నిధుల నుంచి డబ్బులు కేటాయిస్తానని తెలిపారు. మిగులు పనుల గూర్చి కలెక్టర్ తో మాట్లాడుతానని చెప్పారు. మండల కేంద్రం సమీపంలో రూ.3.35 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కేజీబీవీలో మిగులు పనులను వెంటనే పూర్తి చేయించి భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తెస్తామన్నారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఆ శాఖ ఐఎన్‌టీయూసీ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరి జనరల్ ఎనుముల శ్రీధర్ తెలిపారు. షాద్‌నగర్‌లో మంగళవారం 327 యూనియన్ డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రాందాస్, రమేష్, యాదగిరిలు ఎన్నికైనారు. డిస్కం అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' నిధులు విడుదల చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల, జూన్ 11 : రైతు భరోసా పథకం కింద రైతులకు అందించే నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్-2లో చేవెళ్ల పార్టీ మండల సహాయ కార్యదర్శి ఎండీ మక్బూల్ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా పథకం కింద ఎకరానికి పదిహేను వేల రూపాయలను అందజేయాలని, ఆ నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఉన్న సర్వేనెంబర్ 75లో గత 16 నెలలుగా పేదలు గుడిసెలు వేసుకున్నారని, ప్రభుత్వం స్పందించి ఇళ్లులేని వారికి ఇంటి పట్టాలు అందించి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల మహిళా అధ్యక్షురాలు లలిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరికిన ప్రాంతంలో ప్లాంటేషన్

- గుంతలు తీయాలని డీఎఫ్‌వో ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దోర్నాల్ అడవిలో తవ్వుతున్న గుంతలు

ధారూరు, జూన్ 11: ధారూరు ఫారెస్టు రేంజ్‌లోని దోర్నాల్ బీట్‌లో చెట్లు నరికి అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని అటవీ అధికారులు మంగళవారం నిలువరించారు. 'దోర్నాల్ అడవిలో చెట్లు నరికివేత' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ స్పందించారు. దోర్నాల్ అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని ఆయన రేంజ్ అటవీ అధికారులను ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జి రేంజర్ అరుణ, ఎఫ్ఎస్‌వో మోయినోద్దీన్, బీట్ అధికారి అనందంలు చెట్లు నరికిన అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు పనులను ప్రారంభించారు. ఇదే సమయంలో దోర్నాల్ తండాకు చెందిన కొంతమంది మహిళలు అక్కడికి వచ్చి పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మహిళలు అటవీ అధికారులతో గొడవకు దిగడంతో రేంజర్ అరుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్, సిబ్బందితో అక్కడికి చేరుకుని గొడవ చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించేశారు. కాగా, ఇన్‌చార్జి రేంజర్ అరుణ తండావాసులతో మాట్లాడుతూ.. పోడు పట్టాలు ఇచ్చిన తర్వాత అటవీభూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు పట్టాల్లో ఉన్న విస్తీర్ణంలోనే సాగు చేసుకోవాలని కొత్తగా అడవిని నరికి ఆక్రమిస్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. అనంతరం చెట్లు నరికిన ప్రాంతంలో మొక్కలు నాటేందుకు జేసీబీతో గుంతలు తవ్వించారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటాం

ధారూరు రేంజ్ పరిధిలోని దోర్నాల్ బీట్‌లో చెట్లను నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అడవిలో దాదాపు నాలుగు ఎకరాలోట్ల చెట్లను నరికివేసినట్లు గుర్తించాం. అడవిలో చెట్లు నరికివేస్తున్నట్లు అందిన సమాచారంతో ఇన్‌చార్జి రేంజర్ అరుణ అక్కడికి వెళ్లగా చెట్లు నరికిన వ్యక్తులు అప్పటికే అక్కడి నుంచి పారిపోయారు. దీని పై సమగ్ర విచారణ జరిపి అడవిని ఆక్రమించి అక్రమ సాగుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ప్లాంటేషన్ చేయటానికి గుంతలు తీయిస్తున్నాం.

\- జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్

అరాచక శక్తులను ప్రభుత్వం ఉపేక్షించదు : ఎంపీ

కడ్తాల, జూన్ 11 : ఆరాచకాలు హింసను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోదని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని బట్టర్‌ఫ్లై సిటీలో ఈనెల 5న హత్యకు గురైన గోవిందాయపల్లికి చెందిన గుండెమోనిగారి శివగౌడ్. శేషగారి శివగౌడ్ కుటుంబాలను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఎంపీ పరామర్శించారు. జరిగిన ఘటనలపై బాధిత కుటుంబాలను, పోలీస్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ఇద్దరు యువకులను హతమార్చడం బాధాకరమన్నారు. విచారణ జరిపి శిక్ష పడేలా చూడాలని పోలీసులను కోరారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌తో తాను మాట్లాడతానన్నారు. మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.10వేల మేర ఎమ్మెల్యే నారాయణరెడ్డి సాయమందించారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, రవికాంత్‌గౌడ్, వస్పుల జంగయ్య, బిక్యానాయక్, తదితరులున్నారు. ఇద్దరిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. గోవిందాయిపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను దశరథ్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్ నాయక్ ఆర్థిక సాయం అందించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందించాలని దశరథ్ కోరారు. కడ్తాల వైస్ ఎంపీపీ ఆనంద్ మృతుల కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.


పోతుగల్ పాఠశాల విద్యార్థులతో నిర్వాహకులు

విద్యార్థులకు కెరియర్ కౌన్సిలింగ్

షాబాద్, జూన్ 11 : మండల పరిధిలోని పోతుగల్, తాళ్లపల్లి, హైతాబాద్, రేగడిదోస్వాడ తదితర ఉన్న పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు మంగళవారం నగరానికి చెందిన ఆకృతి ప్రాజెక్టు నిర్వాహకులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కెరియర్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, రాజపాల్‌సింగ్, వసంత, అజయ్య, మాట్లాడుతూ విద్యార్థులకు కెరియర్ నిర్ణయించుకోవడానికి ఇచ్చిన కౌన్సిలింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆకృతి ప్రాజెక్టు డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● కడ్తాల్ ఎంఈవో సర్దార్ నాయక్

కడ్తాల్, జూన్ 11: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంఈవో సర్దార్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్య అందుతుందన్నారు. మండలంలోని మైసిగండి గ్రామంలో మంగళవారం కడ్తాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం, సీఆర్‌పీలతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో, నోడల్ అధికారి జంగయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.


మొయినాబాద్ రూరల్ : ర్యాలీలో ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ రాజు తదితరులు

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి

మొయినాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బడీడు పిల్లలను బడికి పంపించాలని అప్పోజిగూడ గ్రామ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు నర్సింహులు కోరారు. మండల పరిధిలోని అప్పోజిగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థల సంయుక్త అధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోష్న, ఉపాధ్యాయురాలు అమృత, సీమకదం, సత్యనారాయణ, సౌమ్య, హరీష్, ప్రభులింగం, రాజు, శివాజీ యూత్ సంఘం అధ్యక్షుడు జగపతి, నాయకులు తదితరులున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కేశంపేట : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జి.మాధవి, అరుణకుమారి, స్వప్న, కే. శ్రీదేవి కోరారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి


చేవెళ్ల : వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

కందుకూరు/చేవెళ్ల, జూన్ 11: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం మండల వైద్యాధికారి డ్డార్ రాధికకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని. అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షల పేరుతో వారిని తొలగించడానికి కుట్రలు పన్నుతోందన్నారు. రేపు అన్ని గ్రామాల నుంచి ఆశావర్కర్లు కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. ఆశాలకు పరీక్షలు నిర్వహించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్షల నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా ఆశాకార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తల యూనియన్ మండల అధ్యక్షకార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, కోశాధికారి ఉమ, సభ్యులు మంజుల, శాంత, సుజాత, పావని, సుజాత, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : డాక్టర్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకుడు బాల్‌రాజ్, ఆశా వర్కర్లు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఆమనగల్లు, జూన్ 11: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైటాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రెండేళ్ల క్రితం గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు లక్షల రూపాయలు అప్పులు చేసి పనులు పూర్తి చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు రూ.2.20 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. బిల్లులు విడుదల చేయాలని 16 నెలల కాలంగా కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం ఎంపీవో శ్రీలతకు మాజీ సర్పంచ్ లు వినతి పత్రం అందజేశారు. లక్ష్మణ్‌నాయక్, పబ్బతి శ్రీను, శోభచందునాయక్, సోన శ్రీను నాయక్, మంజులయాదయ్య, ప్రేమలత నర్సింహ, మల్లమ్మ యాదయ్య, తదితరులున్నారు.

కేజీబీవీకి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి : జడ్పీటీసీ

కడ్తాల్, జూన్ 11: మండల కేంద్రంలో రూ.3.50 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని వెంటనే ప్రారంభించాలని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కోరారు. నిర్మాణం పూర్తైన కేజీబీవీ భవనానికి 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకపోతే వెయ్యి మందితో విద్యుత్ ఉపకేంద్రాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కడ్తాల మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని మంగళవారం వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి దశరథ్ నాయక్ సందర్శించారు. నిర్మాణం పూర్తైన భవనాన్ని పరిశీలించారు. ఏడేళ్ల కాలంగా అద్దె భవనంలో కేజీబీవీ కొనసాగుతోందని, విద్యార్థినిలు అద్దె భవనంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతూ వచ్చారని అన్నారు. విద్యుత్ కనెక్షన్‌ను ఏర్పాటు చేసి నూతన భవనంలో తరగతులను ప్రారంభించాలని దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. లేని యెడల సబ్ స్టేషన్ ముట్టడితో పాటు మండల కేంద్రంలో ధర్నా చేపడుతామన్నారు. ఆర్ఎస్ఎస్ఎం కో-ఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు ప్రియరమేశ్, మంజుల చంద్రమౌళి, మాజీ ఎంపీపీ సువాళి పంతూ, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, హరిచంద్ నాయక్, శ్వేత భూనాథ్, లక్ష్మీ, సులోచన సాయిలు, పూజా దేవ నాయక్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

సజ్జల విశ్వనాథంకు జాతీయ సేవారత్న పురస్కారం


అవార్డు అందుకుంటున్న విశ్వనాథం, శ్రీధర్‌రెడ్డి

కేశంపేట, జూన్ 11: కేశంపేట మాజీ ఎంపీపీ సజ్జల విశ్వనాథంకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సేవారత్న పురస్కారం అందుకున్నారు. అవార్డు సెలక్షన్ కమిటీ కేశంపేట సజ్జల విశ్వానాథంను జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈమేరకు ఈ నెల 10(సోమవారం)న మహారాష్ట్రలోని పూనేలో నిర్వహించిన బహుజన సాహిత్య, 4వ వెస్టర్న్ ఇండియా కాన్ఫరెన్స్‌లో విశ్వానథంకు అవార్డును అకాడయీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం. గౌతమ్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణుల చేతుల మీదుగా అందించారు. సేవారత్న అవార్డుతో తన బాధ్యత మరింతగా పెరిగిందని ఈ సందర్భంగా విశ్వానాథం తెలిపారు. అదేవిధంగా కేశంపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యెన్నం శ్రీధర్‌రెడ్డి బహుజన జాతీయ సేవారత్న పురస్కారం అందుకున్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఆమనగల్లు, జూన్ 11: కల్వకుర్తి కసిరెడ్డి నారాయణ రెడ్డికి మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, ఆమనగల్లు మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షురాలు గోదాదేవిలు కోరారు. ఉన్నత విద్యావంతుడు, విద్యాసంస్థల అధినేత అయిన కసిరెడ్డికి విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సత్యం మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డికి విద్యారంగ సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేసి కల్వకుర్తిలో భారీ మెజార్టీని సాధించిన ఘనత కసిరెడ్డి నారాయణరెడ్డికే దక్కిందన్నారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన కసిరెడ్డికి ప్రజా సమస్యలపై కూడ అవగాహన ఉందని సత్యం అన్నారు. మంత్రి వర్గ విస్తరణలో కసిరెడ్డికి అవకాశం కల్పించాలని వారు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.


మాట్లాడుతున్న ఎగిరిశెట్టి సత్యం

యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ


షాబాద్ : యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో అపర్ణ

షాబాద్, జూన్ 11 : ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని షాబాద్ మండల ఎంపీడీవో అపర్ణ, మండల విద్యాధికారి శంకర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని డ్వాక్రా భవనంలో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి విడతగా 368 వేల యూనిఫాంలను అధికారులు పంపిణీ చేశారు. ఏపీఎం నర్సింలు, డ్వాక్రా మహిళలు తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాఠ్యపుస్తకాల, యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను ఎంఈవో సర్దార్ నాయక్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఏపీఎం రాజేశ్వరి, హెచ్‌ఎంలు యాదయ్య, వెంకటేశ్వర్లు, పద్మావతమ్మ, శైలజ, శ్రీనివాసాచారి, గోవర్ధన్, నోడల్ అధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : మండలంలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. సీఆర్పీలు కృష్ణ, శంకర్, శ్రీనివాస్, నర్సింలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన యూనిఫాం అందజేస్తాం

యాచారం : జిల్లాలో రెండు దఫాలుగా విద్యార్థుల యూనిఫాం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీవో ఏపీడీ సూర్యారావు చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరాక్రాంతి భవన్‌లో యూనిఫాంను పరిశీలించి వారిని అభినందించారు. జిల్లాలో తొలివిడత 67,155 మందికి యూనిఫాం అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని, రెండో దఫా మరో 67,155 మందికి యూనిఫాం కుట్టడం కోసం డ్వాక్రాసంఘాల మహిళలను కోరామన్నారు. ఈ మేరకు పలు మండలాలకు యూనిఫాం పంపిణీ చేశామన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు గతేడాది జిల్లాలో రూ.795 కోట్ల రుణాలందించామన్నారు. ఈఏడాది రూ.850కోట్ల టార్గెట్ పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆయనతో ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

కిషన్‌రెడ్డికి నాయకుల ఘన సన్మానం


కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న వేణుగోపాల్, బొకే అందిస్తున్న కేఎస్ రత్నం

శంషాబాద్ రూరల్/చేవెళ్ల, జూన్ 11 : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ మంగళవారం ఢిల్లీలో కలిసి సత్కరించారు. అదేవిధంగా కిషన్‌రెడ్డిని చేవెళ్ల బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, త్రినేత్ర తదితరులు ఆయన్ను కలిసి పూలబొకేలు అందించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

కందుకూరు, జూన్ 11: ప్రజలకు ఉచితంగా అంబులెన్స్‌ల ద్వారా సేవలందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ రాజబాబు అంబులెన్స్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో సంచార పశువైద్యశాల(1962) అంబులెన్స్, 102 అమ్మఒడి వాహనాన్ని తనిఖీ చేశారు. నెల రోజుల పాటు మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో పశువైద్యశాల అంబులెన్స్ వాహనం ద్వారా రైతులకు చేసిన సేవలను రికార్డుల ద్వారా పరిశీలించారు. వినయ్‌కుమార్, సాయికిరణ్, వెంకటేష్ ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూన్ 11 : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో హవర్లీ బేస్డ్ టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వాచ్య తెలిపారు. మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి అవకాశం ఉందన్నారు. టీజీటీలో తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మ్యాథ్స్, సోషల్, సైన్స్ బోధించుటకు ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. పీజీటీలో తెలుగు రెండు, మ్యాథ్స్ రెండు, బోటనీ ఒక్కటి, జువాలజీ, కామర్స్ ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటల వరకు, అర్హత ఉన్నవారు మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాష్ట్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షుడు సత్తయ్యకు సన్మానం



కందుకూరు, జూన్ 11: నూతనంగా ఎన్నికైన రాష్ట్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షుడు కొత్త కురుమ సత్తయ్యను మంగళవారం మండల సహకార బ్యాంకు చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ సన్మానించారు. ఉదయం నగరంలోని రాష్ట్ర సహకార బ్యాంకు భవనంలో బాధ్యతలు తీసుకున్న సత్తయ్యను సన్మానించారు. ఆయనతో మండల సహకార బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఎలక్ట్రానిక్ షాపులో చోరీ

శంకర్‌పల్లి, జూన్ 11: శంకర్‌పల్లిలోని బాలాజీ ఎలక్ట్రానిక్ దుకాణంలో దొంగలు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 3.48 గంటలకు హైదరాబాద్ ప్రధాన రోడ్డులో గల దుకాణం షట్టర్ తాళాలు విరగ్గొట్టి ముగ్గురు దుండగులు లోపలికి ప్రవేశించారు. కౌంటర్ తాళాలు విరగ్గొట్టి రూ.లక్షా పది వేలు దోచుకెళ్లారు. కాగా, దొంగలు మిగతా ఎలక్ట్రానిక్ వస్తువులను మాత్రం ఎత్తుకెళ్లలేదు. ఉదయం దుకాణం తెరిచేందుకు యజమాని శ్రీనివాస్ రాగా.. దుకాణం తాళాలు తీసి ఉండటంతో పాటుగా షెట్టర్ లేపి ఉండటం గమనించాడు. వెంటనే శంకర్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాడు. డిటెక్టివ్ సీఐ నాగరాజు, ఎస్సైలు సంతోష్‌రెడ్డి, సత్యనారాయణలు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఫింగర్ ప్రింట్ ఆధారాలు సేకరించారు.

బంగారు ఆభరణాల రికవరీ

ఇబ్రహీంపట్నం, జూన్ 11: ఇబ్రహీంపట్నం టౌన్ మంచాల రోడ్డులో పోగొట్టుకున్న మూడు తులాల బంగారు ఆభరణాలను సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా మంగళవారం పోలీసులు ఓ వ్యక్తి నుంచి రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన చిన్నముల ఉష. భర్త మధుసూదన్‌రెడ్డితో కలిసి మూడు తులాల బంగారం గొలుసు, చెవి కమ్మల మరమ్మతు కోసమని సోమవారం కారులో ఇబ్రహీంపట్నం వచ్చారు. మంచాల రోడ్డులో ఉన్న బంగారు దుకాణం వద్ద ఆగి చూసేసరికి ఆభరణాల సంచి ఎక్కడో పడిపోయినట్లు గుర్తించారు. దాంతో బాధితులు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేయగా.. మంచాల రోడ్డుపై పడి ఉన్న ఆభరణాల సంచి మున్సిపల్ కార్మికుడు కప్పరి శ్రీను తీసుకున్నట్లుగా గుర్తించారు. ఈమేరకు అతడి నుంచి రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

అపహరించిన సెల్‌ఫోన్..

యాచారం, జూన్11 : దొంగలు అపహరించిన సెల్‌ఫోన్‌ను హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు రికవరీ చేసి బాధితుడికి మంగళవారం అందించారు. మండల పరిధిలోని తాటిపర్తికి చెందిన వెంకటేష్ సెల్‌ఫోన్‌ను ఇటీవల దొంగలు తస్కరించారు. బాదితుడు పోలీసులను ఆశ్రయించగా ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో కలిసి యాప్ ద్వారా దొంగ నుంచి ఫోన్ రికవరీ చేశారు. బాధితుడు పోలీసులకు ధన్యవాదాలు చెప్పారు.

అక్రమంగా మట్టి తరలింపు.. 13 టిప్పర్ల సీజ్

ఇబ్రహీంపట్నం, జూన్ 11: అక్రమంగా మట్టి తరలిస్తున్న 13 టిప్పర్లను ఇబ్రహీంపట్నం పోలీసులు మంగళవారం సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఎస్సై మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం మాడ్గుల మండలం ఇర్విన్ నుంచి అనుమతులు లేకుండా టిప్పర్లలో మట్టిని ఇబ్రహీంపట్నం పరిధి కొంగరకలాన్ దగ్గర ఉన్న ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈక్రమంలో 13 టిప్పర్లను స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై మైబెల్లి తెలిపారు.

ముట్పూర్ శివారులో చెట్లు నరికేసిన దుండగులు

కొందుర్గు, జూన్, 11: మండల పరిధిలోని ముట్పూర్ గ్రామ శివారు గ్రామమైన చుక్కమెట్టు గుట్టపై పెంచిన చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గుట్టపై చెట్లను పెంచడం జరిగిందని, వీటిలో దాదాపు 20 చెట్లను గత రెండు రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది నరికివేశారని చుక్కమెట్ గ్రామస్థులు మంగళవారం తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మిగితా చెట్లను కాపాడాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను సంప్రదించగా, ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి, ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆకుల మైలారంలో 40 గొర్రెల అపహరణ

యాచారం, జూన్ 11 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి ఆకులమైలారంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు 40 గొర్రెలను అపహరించారు. గ్రామానికి చెందిన గొరిగె మల్లయ్య సాయంత్రం గొర్రెలను మందలో తోలి అన్నం తినడానికి ఇంటికి వచ్చాడు. తర్వాత మంద వద్దకు వస్తుండగా మినీ ట్రక్కు వేగంగా వెళుతుండటం గమనించి భయంతో వెళ్లి చూడగా.. మంద నుంచి గొర్రెలు అపహరించారని గుర్తించాడు. వెంటనే గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. కొందరు యువకులతో కలిసి మందలోకి వెళ్లి చూడగా మొత్తం 40 గొర్రెలు ఎత్తుకెళ్లినట్లు మల్లయ్య వాపోయాడు. దొంగలు మంద వద్ద రెండు తాళ్లను వదిలిపోయారని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శ్రీశైలం-హైదరాబాద్, నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారులపై వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు డివిజన్ పరిధి పోలీసులను అలర్ట్ చేసి మాల్, కొత్తగూడగేటు, ఆగాపల్లి, గున్‌గల్, బొంగులూర్ గేటు ప్రాంతాల్లో తనిఖీ ముమ్మరం చేశారు.

పట్టపగలే ఇంటికి కన్నం.. బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

ఆదిభట్ల, జూన్ 11 : పట్టపగలే ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన దుండగుడు రూ1,20వేలు విలువచేసే నగలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్క యంజాల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పరిధి సాగర్ ఎన్‌క్లేవ్ నివాసం ఉండే చిన్నుల మౌనిక మంగళవారం మధ్యాహ్నం ఇంటి తలుపులు మూసి వేసి బట్టలు ఆరవేయడాని ఇంటి రెండో అంతస్తుపైకి వెళ్లింది. పది నిమిషాల తరువాత వచ్చి చూసేసరికి తలుపు లోపలి నుంచి గడియ వేసి ఉంది. కిటికీలో నుంచి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తి ముఖాన్ని గుడ్డతో కప్పుకొని కనిపించాడు. వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలుచుకు రావడానికి వెళ్లింది. దాంతో ఆ వ్యక్తి వెనకాల డోరు నుంచి పారిపోయాడు. లోపలికి వెళ్లి చూడగా.. అల్మారాలు తెరిచి ఉన్నాయి. రూ.లక్షా20 వేలు విలువచేసే బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి మంగళవారం సాయంత్రం ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మరో ఇంట్లో చోరీకి ప్రయత్నించి విఫలమై చివరకు వాచ్‌మెన్ చేతిలో రూ.12 వేలు విలువచేసే సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఘటన తుర్క యాంజాల్ పరిదిలోని శ్రీరాంనగర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తుర్కయాంజాల్ పరిధిలో విల్లాలో నివసించే తిరుమన తురల్ సోమవారం రాత్రి భోజనం చేశాక.. తన కూతురు.. తాను వేర్వేరు గదుల్లో నిద్రపోయారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో తలుపుకొట్టినట్లు శబ్దం వచ్చింది. అనుమానం వచ్చిన అతని కూతురు డయల్ 100కు ఫోన్ చేసింది. దాంతో చోరీ విఫలమై వాచ్‌మెన్ దగ్గర ఉన్న రూ.12వేల విలువచేసే సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజీలో గుర్తుతెలియన దుండగులు నిచ్చెనలు ఉపయోగించి బాల్కని ద్వారాలో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


నారాయణ ఐటీ రావిరాల బ్రాంచ్ క్యాంపస్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 1000 లోపు 6 ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యం కో-ఆర్డినేటర్ ఎం.వెంకటరెడ్డి, డీన్ శ్రీనివాస్, ఏజీఎం గడ్డం శ్రీనివాస్, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిషరెడ్డి, అధ్యాపకులు తదితరులు. - **మహేశ్వరం, జూన్ 11**

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, జడ్పీటీసీ భరత్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కేంద్రం ప్రభుత్వం ద్వారా నాగర్‌కర్నూల్ పార్లమెంట్, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని బండిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు భరత్‌ప్రసాద్ పేర్కొన్నారు.

కడ్తాల్ : సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. సామాజిక సేవల్లో లయన్స్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మూడు నెలల పాటు లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అంబలి కేంద్రం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మహేంద్ర కుమార్ రెడ్డి , జోన్ చైర్మన్ ఏమిరెడ్డి శేఖర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేసవి కాలంలో మూడు నెలల పాటు బాటసారులు, ప్రయాణికుల దాహర్తి బాధలు తీర్చిన అంబలి కేంద్రం నిర్వాహకుడు చెన్నకిషన్ రెడ్డిని, కేంద్రంలో అంబలి సరఫరా చేసిన సభ్యులను సత్కరించారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రవాస భారతీయులు ముందుకు రావాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి కోరారు. అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అట్లాంటా నగరంలో నిర్వహిస్తున్న ఆటా-2024 వేడుకల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడ్తాల్ : అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి జంగమ్మ కుటుంబాన్ని మంగళవారం జడ్పీటీసీ దశరథ్ నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జంగమ్మ కూతురు శివలీల వివాహానికి రూ. 1.16 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలందిస్తున్నట్లు దశరథ్ తెలిపారు.

తలకొండపల్లి : మండల కేంద్రానికి చెందిన కాటోజు స్వరూప, కాటోజు పద్మల ఇళ్ల నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేశ్ చేయూతనందించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణానికి చేయూతనందించాలని వారు జడ్పీటీసీని కోరారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చారు. ట్రస్ట్ సభ్యులు అందజేశారు. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, శేఖర్‌యాదవ్, నాయకులున్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు నుంచి వాస్‌దేవ్‌పూర్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ, పల్లె చెలుక తండా, మేడిపల్లి, యాచారం మీదుగా మాల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని చరికొండ ఎంపీటీసీ పాలకుర్ల అద్దాల రాములు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సచివాలయంలో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కడ్తాల్ : నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుపొంది తొలిసారిగా కడ్తాల మండల కేంద్రానికి వచ్చిన డాక్టర్ మల్లు రవికి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఘనస్వాగతం పలికారు. టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో కలిసి పూలమాలలు, శాలువాలతో ఆయన్ను సత్కరించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు బిక్షపతి, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రాంచందర్ నాయక్, కృష్ణ, బిక్షపతి, భానుకిరణ్, శేఖర్‌గౌడ్, బాల్‌రాజ్, డాక్టర్ శ్రీను, తదితరులు ఉన్నారు.